క్లుప్తంగా

కోడి పందెం బరుల ధ్వంసం



కోడిపందెం బరులను ధ్వంసం చేస్తున్న తహసీల్దారు వెంకటరమణ, ఎస్సై కిరణ్‌కుమార్

ఉంగుటూరు: కోడి పందేల నిర్వహణకు నారాయణపురంలో రంగం సిద్ధం చేశారు. శుక్రవారం నారాయణపురం ఉదయం నుంచి మూడు ప్రదేశాల్లో బరులును శుభ్రం చేసి, షామియానాలను ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు వెంకటరమణ, ఎస్సై మణి కుమార్, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, పోలీసులు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు అక్కడికి వెళ్లి షామియానాలు తొలగించారు. బరులను దున్నేశారు.

నేడు బువ్వనపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభం

నిడమర్రు: బువ్వనపల్లిలో రూ.2.24 కోట్లుతో జరిగిన వివిధ అభివృద్ధి పనులను శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. రూ.30 లక్షల అంచనా వ్యయంతో పూర్తి చేసిన ధర్మ మంచినీటి చెరువు పనులు, రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ డ్రైయిన్లు, రూ.20 లక్షలతో పూర్తి చేసిన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం పనులు, రూ.21 లక్షలతో నిర్మించిన చెరువు ప్రహరీ గోడ, రూ.37 లక్షలతో పూర్తి చేసిన గ్రామ శ్మశాన వాటిక నిర్మాణం, రూ.90.74 లక్షలతో పూర్తిచేసిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర భవనం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనంను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హాజరవుతారని సత్యకుమార్ తెలిపారు.

ఎల్లాప్రగడ సేవలు చిరస్మరణీయం

భీమడోలు: నవయుగ ధన్వంతరి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మానవాళి ఆరోగ్యానికి చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జయరామ్ అన్నారు. పూళ్లలో పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు 129వ జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎం.జయరామ్ మాట్లాడుతూ వైద్య రంగంలో సుబ్బారావు అనేక పరిశోధనలతో భయంకరమైన వ్యాధుల నివారణకు మందులు కనుగొని మానవాళికి మేలు చేశారని అన్నారు. తొలుత సుబ్బారావు చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి, నివాళులర్పించారు. మండల కన్వీనర్ ఎం.పల్లారావు, సభ్యులు ఎస్.రామారావు, డి.నాగరాజు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

పెదపాడు: పేదలకు ప్రతి ఒక్కరూ సాయం అందించాలని ఏలూరు అమలోద్భవి కతీడ్రల్ దేవాలయ విచారణ కర్తలు ఐ మైకేల్, పెదపాడు విచారణ గురువులు పీ మెల్కియోర్ రాజు తెలిపారు. వసంతవాడకు చెందిన ఇంజమాల ప్రాంచీనమ్మ 2వ వర్ధంతి సందర్భంగా పెదపాడు మండలంలోని వసంతవాడ అంబేడ్కర్ నగర్‌లోని ఆర్‌సీఎం దేవాలయంలో జ్ఞాపకార్థ దివ్య బలిపూజ నిర్వహించారు. విచారణ కర్తలు మైకేల్, పెదపాడు విచారణ గురువులు పీ మెల్కియోర్ రాజు ఇంజమాల శామ్యూల్ ప్రాంచీనమ్మ జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేశారు. రెవ. ఫాదర్ మరియకుమార్ ఎం రాజు ఆశీర్వాదం, రత్నరాజు, జ్యాకీను మర్తీను సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు రక్షణగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతోందని పెదవేగి మండలం అమ్మపాలెం వైఎస్సార్ సీపీ నేత దేవరపల్లి రాజు అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం అమ్మపాలెంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి కళ్లజోళ్లను నాయకులు, అధికారులు అందజేశారు. సర్పంచ్ దేవరపల్లి యేసు మరియమ్మ, ఎంపీడీవో జీ ఆర్ మనోజ్, ఎంపీటీసీ వై అనురాధ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): నూజివీడులో పేదలు సాగు చేస్తున్న 10వేల ఎకాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హక్కు పత్రాలను అందజేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సంఘం ఏలూరు జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న అడవి బంజరు ప్రభుత్వ రెవెన్యూ భూములను పేదలకు ఇవ్వాలని కోరారు. బీకేఎంయూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కుంచే వసంతరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వనసంరక్షణ సమితికి కేటాయించిన భూములను ఈఎస్ఎస్ సభ్యులకు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాల యేసు, పొట్టేలు పెంటయ్య పాల్గొన్నారు.

ఉత్కంఠగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు



దెందులూరు: కబడ్డీలో విజయం సాధించిన గోపన్నపాలెం జట్టు



ఉంగుటూరు: విజయం సాధించిన వెల్లమిల్లి-2 సచివాలయ జట్టు

0దెందులూరు: ఆడుదాం ఆంధ్ర భాగంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. క్రీడాపోటీల్లో పాల్గొన్న జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన దెందులూరు మండలస్థాయి కబడ్డీ పోటీల్లో గోపన్నపాలెం, సోమవరప్పాడు జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో గోపన్నపాలెం జట్టు విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్ తెలిపారు. మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో గాలాయగూడెం జట్టు పోతునూరు జట్టుపై విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికై నట్టు పోతునూరు ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారావు వివరించారు. విజేతలను మండల ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు, ఎంఈఓలు వీఎన్వీ ప్రసాద్, కే. అన్నమ్మ, గ్రామ సర్పంచులు కోటే నాగమల్లేశ్వరి కుమార్, బోదుల స్వరూప్, గ్రామ కార్యదర్శులు షరీఫ్, స్టానీష్ బాబు అభినందించారు.

కబడ్డీలో వెల్లమిల్లి జట్టు ప్రథమం



భీమడోలు: క్రీడాకారులను సూచనలందిస్తున్న ఎంపీడీవో, పీడీలు

ఉంగుటూరు: ఆడుదాం ఆంధ్ర కబడ్డీలో పోటీల్లో మండలస్థాయిలో వెల్లమిల్లి సచివాలయ జట్టు విజయం సాధించి ప్రథమంలో నిలిచింది. ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. క్రికెట్‌లో చేబ్రోలుపై కైకరం జట్టు, గోపినాథపట్నం జట్టుపై గోకవరం జట్టు విజయం సాధించాయి. నారాయణపురం-2పై చేబ్రోలు-2 జట్టు విజయం సాధిచింది. రాచూరుపై గోపాలపురం జట్టు విజయం సాధించింది. కాగుపాడుపై నీలాద్రిపురం జట్టు, ఉంగుటూరుపై బాదంపూడి జట్టు విజయం సాధించాయి. కబడ్డీలో నీలాద్రిపురంపై వెల్లమిల్లి-2 విజయం సాధించగా, యర్రమిల్లిపాడుపై గొల్లగూడెం విజయం సాధించింది. ఫైనల్ పోటీల్లో గొల్లగూడెం, వెల్లమిల్లి-2 జట్లు తలపడగా వెల్లమిల్లి- 2 విజయం సాధించింది.

హోరాహోరీగా ఫైనల్ క్రికెట్ మ్యాచ్

భీమడోలు: యువతలో క్రీడానైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా స్ఫూర్తిని చాటుతున్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ మ్యాచ్ మూడో రోజైన శుక్రవారం ఘనంగా ముగిసాయి. తొలుత ఫైనల్‌కు చేరిన టీము క్రీడాకారులను ఎంపీడీవో పద్మావతిదేవి పరిచయం చేసుకున్నారు. నియమ నిబంధనలను పీడీ వెంకటేశ్వరరావు వారికి వివరించారు. ఫైనల్ మ్యాచ్‌లో భీమడోలు-1, భీమడోలు-2 టీములు తలపడగా మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన భీమడోలు-1 టీము సభ్యులు నిర్ణీత 8 ఓవర్లలో 59 పరుగులు చేసారు. తర్వాత బ్యాటింగ్ చేసిన భీమడోలు-2 క్రీడాకారులు ఇంకా మూడు బంతులు మిగిలి ఉండగానే 60 పరుగులు చేసి విజేతగా నిలిచారు. ఈనెల 10వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న క్రికెట్ పోటీలకు భీమడోలు-2 టీము అర్హత సాధించింది. టీము సభ్యులను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అభినందించారు. ఈవోఆర్‌డీ ఏ.సుందరి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కొండలరావుపాలెంలో రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కొఠారు, రైతు సంఘ నేతలు

పెదవేగి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు ఆవిష్కరించారు. శుక్రవారం పెదవేగి మండలం కొండలరావు పాలెంలో రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పెదవేగి : విజయరాయిలో కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం విజయరాయిలోని ఉద్యాన పరిశోధన కేంద్రం వద్ద జిల్లా ఉద్యాన అధికారి రామ్మోహన్‌కు కొబ్బరి రైతుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కొబ్బరి రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొబ్బరి మద్దతు ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదని చెప్పారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని విజయరాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి రైతులు గుది బండి రమేష్ రెడ్డి, బి.వెంకటరెడ్డి, పి.రవీంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు
- సంప్రదాయ నృత్యాలతో సందడి చేసిన యువత



పెదవేగి : భోగి మంట వద్ద సంప్రదాయ నృత్యం చేస్తున్న దంత వైద్య విద్యార్థినులు

దెందులూరు: సంక్రాంతి సంబరాలు వాడవాడలా ప్రారంభమయ్యాయి. హరిదాసులు ఇంటింటికీ వెళ్లి ఇంటి యజమానులు ఇచ్చే కానుకలను స్వీకరించి వారిని ఆశీర్వదిస్తున్నారు. మరోవైపు దెందులూరు 9వ వార్డు సెంబరులో మండల శ్రీరామదండు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరేళ్లగా దెందులూరులో శ్రీరామదండు ఆధ్వర్యంలో సుగ్గిశెట్టి సూకరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నారు.

దేశ సంప్రదాయ పండుగల్లో సంక్రాంతి ఒకటి

పెదవేగి : దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వారి సృజనాత్మకతను చాటుకున్నారు. భోగి మంటలు వద్ద సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ భారతదేశ సంప్రదాయ పండుగలో సంక్రాంతి పండుగ ఒకటి అన్నారు. సంక్రాంతి పండుగను సంతోషంగా ఆనందంగా జరుపుకోవాలని ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫేలిక్స్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ స్లీవరాజు, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ అరుణ్, డాక్టర్ అనురాధ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ శివ కిరణ్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.



దెందులూరు: హరిదాసుకు దానం చేస్తున్న యువతి



పెదవేగి : ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఫాదర్ మోజెస్, కళాశాల బృందం

ప్రజాభాగస్వామ్యంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి



జీపీడీపీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ పంచాయతీల్లో సుపరిపాలన అమలై నిజమైన గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఈవోఆర్‌డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. జీపీడీపీ అమలు నివేదిక, బాల సభ, మహిళా సభ నిర్వహణ, గ్రామ స్వరాజ్యం తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక అత్యంత ఖచ్చితంగా ఉండాలని కోరారు. ఈ పనులకు గ్రామ, మండల, జిల్లా పరిషత్ నిధులు వెచ్చించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



భీమడోలులో మాట్లాడుతున్న సీఐ బీబీ రవికుమార్, ఎస్సై వై సుధాకర్

భీమడోలు: సంక్రాంతి ముగుసులో కోడి పందేలు, జూద క్రీడలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని భీమడోలు సర్కిల్ సీఐ బి.భీమేశ్వర రవికుమార్ అన్నారు. భీమడోలులో పండుగ నేపథ్యంలో కోడి పందేలు, జూద క్రీడలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి తీసుకున్న చర్యలపై శుక్రవారం భీమడోలు ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన సమావేశంలో మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగించే వ్యక్తులపై, సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఇళ్ల నుంచి వేరే గ్రామాలకు వెళ్లే వారంతా తలుపులకు తాళాలు వేసుకోవాలని, విధిగా పోలీసులు సమాచారం అందిస్తే ఆ ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వి.వెంకటేశ్వరరావు, హెచ్‌సీ డి.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

స్ఫూర్తి మంత్రం స్వామి వివేకానందుని జీవితం



భీమడోలులో వివేకానందుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐ బీబీ రవి కుమార్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ

భీమడోలు: భారతదేశ ఆణిముత్యం, యువతకు స్ఫూర్తిదాత స్వామి వివేకానందుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులోని స్వామి వివేకనందా యూత్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని విగ్రహానికి సీఐ బీబీ రవికుమార్, జెడ్పీటీసీ తుమ్మగుంట రంగ, సర్పంచ్ పాము సునీతలను పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్ సవలం నాని అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానందుని బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత మాట్లాడుతూ వివేకనందుని ఆశయ సాధనకు యువతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు సుతాపల్లి ప్రసాద్, జగన్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, పున్నం గోపి, వర్ధినేడి సాయి, పెద్దలు పంచకర్ల సత్యనారాయణ, ఈడే సత్యనారాయణ, ప్రసాద్, సత్యేంద్ర, గంధం భాస్కరరావు, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

126 మంది బైండోవర్

దెందులూరు: దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు జూద క్రీడలకు సంబంధించి 126 మందిని బైండోవర్ చేసినట్టు దెందులూరు ఎస్సై కే స్వామి అన్నారు. శుక్రవారం రాత్రి దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఏ గ్రామంలోనైనా పేకాట, కోడిపందేలు, గుండాట నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని గ్రామాల్లో పోలీస్ నిఘా ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం మేధినరావుపాలెంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.16,200 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

మెరుపు దాడులు

పెదవేగి : పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం జగన్నాథపురంలో పేకాట ఆడుతున్న ఇద్దరి అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,100 నగదు, ములక్కాయపాడులో పేకాట నిర్వహిస్తున్న ముగ్గురి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గుండె పరీక్షలు



అడవికొలనులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నిడమర్రు: అడవికొలను ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 350 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి పి.తేజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 850 మందికి కంటి పరీక్షలు, రక్త పరీక్షలు వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసామన్నారు. ముందుగా ఈ శిబిరాన్ని ఎంపీడీవో జి. విజయకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చంటి పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ టి. కృష్ణకిషోర్, స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ మేఘన, కంటి వైద్యనిపుణులు విజయ్, ఆరోగ్య విస్తరణ అధికారి కృపావరం, సిబ్బంది మరియమ్మ, ప్రియదర్శిని, నాయకులు నిమ్మల రమేష్ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల పరిశీలన

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలన్నీ బాగానే ఉన్నాయని ఏలూరు ఆర్డీవో ఉంగుటూరు నియోజకవర్గ ఓటరు రిజిస్ట్రేషన్ అధికారి ఖాజావలి తెలిపారు. శుక్రవారం ఉంగుటూరు నియోజకవర్గంలోని కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు, కాకర్లమూడి, పూళ్ళ,అంబర్‌పేట, ఎంఎంపురంలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. చేబ్రోలు పోలింగ్ కేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ తాగునీరు. టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, ర్యాంపులను పరిశీలించినట్టు ఆర్డీవో తెలిపారు. ఏలూరు డివిజన్‌లో మొదటి, రెండో దశలో 66 గ్రామాల్లో భూ రీ సర్వేలు పూర్తయ్యాయని తెలిపారు. మూడో దశలో 46 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. 20 ఏళ్ల పైబడి భుములను అనుభవిస్తున్న వారికి వాటిపై హక్కు కల్పించే కార్యక్రమం కొనసాగుతోందని ఆయన చెప్పారు.

తాగునీటి సరఫరాలో సమ న్యాయం

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీ పరిధిలో దశాబ్దాలుగా తాగునీటిని సరఫరాలో నెలకొన్న ప్రాంతీయ వ్యత్యాసాలు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు జోక్యంతో తెరపడింది. దెందులూరులో గిరిజన, దళిత, బీసీ ప్రాంతాలకు రాత్రి వేళల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో రెండు పూటలా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గిరిజన దళిత ప్రాంతంలో ఒక పూటే సరఫరా అవుతోంది. ఈ విధానంపై 'సాక్షి'లో కథనం ప్రచురించడంతో ఈ విషయాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా ఏసుబాబు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎట్టకేలకు శుక్రవారం నుంచి దళిత, గిరిజన ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా చేస్తున్నారు. దీనిపై బీసీ దళిత, గిరిజన ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, జిల్లా ప్రధాన కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కుడార్రై ఉత్సవం



కుడార్రై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి కుడార్రై ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవికి విశేష ప్రసాద నివేదన చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సంగీత, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. నగరానికి చెందిన పరిమి సావిత్రి బృందం నిర్వహించిన శ్రీ కృష్ణ లీలా తరంగిణి గానామృత సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. కిళాంబి పూర్ణ శ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. ట్రస్టీబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు,దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి రిమాండ్

భీమడోలు: పూళ్ల గ్రామానికి చెందిన వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడ్ని శుక్రవారం భీమడోలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూళ్ల గ్రామానికి చెందిన సిద్దాబత్తుల విఘ్నేశ్వరరావు కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన నూతులపాటి పోలు కుటుంబానికి మధ్య గొడవలున్నాయి. ఆ నేపథ్యంలో గతంలో విఘ్నేశ్వరరావు అన్నయ్య శంకరం మృతి చెందాడు. ఈ కేసు కోర్టులో నడుస్తోంది. తన అన్నయ్య శంకరం మృతికి కారణమైన పోలుపై విఘ్నేశ్వరరావు పగ పెంచుకున్నాడు. పూళ్ల బ్రాందీ షాపు వద్ద మద్యం మత్తులో బుధవారం రాత్రి విఘ్నేశ్వరరావు, పోలు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీనితో ఆగ్రహించిన విఘ్నేశ్వరరావు తన వద్ద ఉన్న బీరు సీసాతో పోలు తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన పోలును ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుడు పోలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విఘ్నేశ్వరరావుపై కేసు నమోదు చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు గ్రామ శివారు దాసరి గూడెంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసారు. పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,120 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.